క్లుప్తంగా

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



చెక్ అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

జలుమూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.ఉమా మహేశ్వరరావు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అసోసియేషన్ తరపున రూ.లక్ష సాయం అందించారు. శ్రీకాకుళంలోని విశాఖ బికాలనీలో నివాసముంటున్న మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి చెక్‌ను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కోశాధికారులు రోణంకి కృష్ణం నాయుడు, కె.భుజంగరావు, సభ్యులు జగదాంబ, రాష్ట్ర అసోసియేషన్ సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, మహిళా వైస్ ప్రెసిడెంట్ అరుణ కుమారి, కెల్లి అప్పన్న ఉన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. హిరమండలం ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన రికార్డులు, విద్యార్థుల హాజరును, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. డబుల్ రూల్, ఫోర్ రూల్ బుక్‌లలో రాయించాలని సూచించారు. సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



జీవామృతం తయారీని పరిశీలిస్తున్న రీజనల్ టెక్నికల్ లీడ్ అధికారులు

సారవకోట: ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి, మానవ మనుగడకు ఎంతో మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ శాఖ రీజనల్ టెక్నికల్ లీడ్ అధికారులు ప్రకాష్, హేమసుందర్ అన్నారు. మండలంలోని పద్మాపురం గ్రామానికి చెందిన రావాడ మోహన్‌రావు తన 22 ఎకరాలలో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్న పంటలను బుధవారం పరిశీలించారు. జీవామృతం తయారీని పరిశీలించారు. 18 రకాల నవ ధాన్యాల సాగు చేయడం వల్ల వాతావరణంలో ఉన్న కార్బన్ శాతం నేలలో స్థిరీకరించబడుతుందన్నారు. మొక్కకు కావాల్సిన పోషకాలు లభిస్తాయని, నేలలో సూక్ష్మ జీవులు సమృద్ధిగా అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రధాన పంటకు ముందుగా నవధాన్యాలు సాగు చేయడం వల్ల ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



భోజనాలను పరిశీలిస్తున్న జిల్లా సమన్వయాధికారి బాలాజీ

పాతపట్నం: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో శాతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ఇప్పటినుంచే ప్రణాళిక తయారు చేసుకోవాలని, విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని, డార్మిటరీలు, మరుగుదొడ్లను పరిశీలించారు. ప్రిన్సిపాల్ వి.అర్చన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకం



నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

పొందూరు: అమెరికాకు చెందిన తెలుగు దంపతులు రామ్ మైనేని, సుష్మాలు తాడివలస పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను గత కొన్ని ఏళ్లుగా దత్తత తీసుకుని చదివిస్తున్నారు. వారిలో పదో తరగతి పూర్తిచేసిన ఇద్దరు విద్యార్థినులు మెట్ట లక్ష్మి, కూన రేవతికి పంపిన నగదు బహుమతిని హెచ్ఎం బల్ల కంటయ్య బుధవారం అందజేశారు. ప్రస్తుతం రూ.8 వేల నగదును ఒక్కొక్కరికి అందజేశారు. వీరితో పాటు మరో నలుగురు విద్యార్థినులు ఉన్నారు. వారి చదువులకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా చేస్తున్నారు. వారి ఉన్నత చదువులకు సహాయపడుతున్నారని హెచ్ఎం తెలిపారు.

• వితరణ



పొందూరు మండలంలోని తాడివలస ఉన్నత పాఠశాలకు సుమారు 18 వేలు విలువ చేసిన వాటర్ ప్యూరిఫయిర్‌ను గోరింట గ్రామానికి చెందిన కూన చిరంజీవిరావు వితరణగా అందజేశారు. దీనిని బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈయన కుమార్తె కూన హిమబిందు ఇదే పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 553 మార్కులతో ఉత్తీర్ణత సాధించినందుకు వాటర్ ప్యూరిఫయిర్‌ను అందజేసినట్లు హెచ్ఎం బల్ల కంటయ్య తెలిపారు.

– పొందూరు

• సత్ప్రవర్తనతో మెలగాలి



విద్యార్థి దశలో వేసిన తప్పటడుగులు వారి జీవితాలను నాశనం చేస్తాయని సరుబుజ్జిలి ఎస్సై బి.నిహార్ తెలిపారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నినాదంలో భాగంగా సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారవద్దని ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు తెలిపారు. ఈ సదస్సుల్లో ఎన్ఎస్ఎస్ పీఓ రమేష్‌సాహు, అధ్యాపకులు పాల్గొన్నారు.

– సరుబుజ్జిలి

• ఎరువుల పంపిణీ



నరసన్నపేట మండలంలోని రావులవలస రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఎరువులు పంపిణీ చేపట్టారు. 450 యూరియా బస్తాలను రైతులకు అందజేశామని సర్పంచ్ పల్లి లక్ష్మి తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో ముందుగా డబ్బులు చెల్లించిన రైతులకు మాత్రమే ఎరువులు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం.కృష్ణారావు, సచివాలయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

– నరసన్నపేట

• గోతులమయం



నరసన్నపేట మండల కేంద్రం నుంచి కంబకాయకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు గోతులమయంగా మారింది. వర్షం నీరు రోడ్డుపై నిల్వ ఉంటుంది. పాతబస్టాండ్ నుంచి కంబకాయ కూడలి మీదుగా ఫ్లై ఓవర్ వైపు వెళ్లే మార్గంలో రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డులో రాకపోకలు సాగించాలంటే నరకయాతన పడాల్సి వస్తుందని. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

– నరసన్నపేట

• నడకయాతన



హిరమండలం ఎంపీడీఓ కార్యాలయ రోడ్డు గోతులమయంగా మారింది. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉంటుంది. రోజూ ఈ రహదారిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు మండల పరిషత్, తహసీల్దార్, శాఖా గ్రంథాలయం, మేజర్ పంచాయతీ, వెలుగు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలు, ఆర్అండ్‌బీ అతిథిగృహం, పశువుల ఆస్పత్రి వంటి వాటికి వెళ్లివస్తుంటారు. ఇప్పటికైనా గోతులను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

– హిరమండలం

వెద పద్ధతే ఆధారం

- దమ్ము పెట్టడానికి రైతుల వెనకడుగు
- పాతపట్నం నియోజకవర్గంలో 56,900 ఎకరాల్లో వెదలు

మెళియాపుట్టి:

ప్రస్తుత పరిస్థితులల్లో పాతపట్నం నియోజకవర్గంలో రైతులు వరి పంటలో దమ్ముపట్టే ప్రక్రియకు దూరంగా ఉంటూ వస్తున్నారు. విపత్తులను తట్టుకుని, పంట చేతికి వస్తుందన్న నమ్మకం లేని రైతన్న వ్యవసాయంపై మక్కువను తగ్గించుకుంటున్నాడు. నారుపెంచి, దమ్ముపట్టి, నాటువేసే పద్ధతికి తగ్గుతుంది. వెదలపైనే అధికంగా ఆధారపడుతున్నారు. వ్యవసాయ పద్ధతులు మారుతున్న తరుణంలో పెట్టుబడులకు వెనకాడుతున్నారు. దమ్ములో గట్లు వేయడం, నారు వేయడం, నారు తీయడం, దమ్ముపట్టడం వంటి పనులు చేయాల్సి ఉంటుంది. ఎకరాకు సుమారు రూ.8 వేలు నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుంది. వెదలు వేయడంతో ఖర్చు తగ్గుతుందని ఈ పద్ధతిపైనే 80 శాతం మంది రైతులు మొగ్గుచూపుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 76,000 ఎకరాల్లో సాగుభూమి ఉంటే.. వెద పద్ధతిలో 56,900, కేవలం 19,100 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేస్తున్నారు. మిగిలిన 56,900 ఎకరాల్లో వెద జల్లుతున్నారు. గత ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి పెట్టుబడి సాయం రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ ఏడాది ఇంతవరకు పెట్టుబడిసాయం రూ.20 వేలను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అందజేయకపోవడంతో రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



వసుంధర గ్రామం వద్ద వేసిన వెద పంట

నియోజకవర్గంలో వ్యవసాయ భూమి, వెదలు వేసిన భూమి వివరాలు (ఎకరాల్లో)

మండలం	వ్యవసాయ భూమి	దమ్ములు చేసినవి	వెద పద్ధతి
పాతపట్నం	17,800	3,600	14,200
మెళియాపుట్టి	16,100	4,800	11,300
కొత్తూరు	16,900	5,200	11,700
ఎల్.ఎన్.పేట	11,200	2,100	9,100
హిరమండలం	14,000	3,400	10,600

దమ్ము చేస్తే మేలు..



అధిక శాతం రైతులు వెదలు వేయడానికి మొగ్గు చూపారు. మెళియాపుట్టి మండలంలో కేవలం 30 శాతం మంది రైతులు మాత్రమే వరి నాట్లు వేయడానికి సుముఖంగా ఉన్నారు. దమ్ము పట్టడం వల్లే భూసారం పెరుగుతుంది. రైతులకు దిగుబడి కూడా పెరుగుతుంది. క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడేలా సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

– ధానకర్ణుడు, మండల వ్యవసాయశాఖ అధికారి, మెళియాపుట్టి

కూలీలు దొరకడం కష్టంగా ఉంది



నాకు రెండెకరాల భూమి ఉంది. ప్రస్తుతం వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదు. అత్యధిక కూలి డిమాండ్ చేస్తున్నారు. వర్షాధార భూములు కావడంతో దమ్ము పట్టడానికి ధైర్యం చేయలేకపోతున్నాం. జూలై నెల వచ్చినా సరైన వర్షాలు లేవు. దమ్ముపడితే ఇబ్బందులు ఉంటాయనే ఆలోచనతోనే వెద వేసుకున్నాం.

– సిరిపురం గోపాలరావు, రైతు, మాకనాపల్లి గ్రామం

వ్యవసాయం చాలా కష్టం



వ్యవసాయం చేయాలంటేనే భయం వేస్తుంది. అన్నికష్టాలను దాటి పంటలు పండించి, పంట చేతికివచ్చే సమయంలో అకాల వర్షాలు, ఇతరత్రా సమస్యలతో పెట్టుబడులు కూడా రాని రోజులు చూశాం. శ్రమను తగ్గించి, మెలకువలు పాటిస్తూ వ్యవసాయం చేసుకుంటున్నాం. అందులో భాగంగానే వెదలు వేయడానికి మొగ్గు చూపుతున్నాం.

– గొల్ల పోలమ్మ, గిరిజన రైతు, నేలబొంతు గ్రామం, మెళియాపుట్టి మండలం

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

జలుమూరు: తిమడాం ఫీడర్‌లో శుక్రవారం నిర్వహణ పనులు చేయనున్నారు. ఈ మేరకు ఏఈ వి.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీముఖలింగం, పర్లాం, అచ్చుతాపురం, బైదలాపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామన్నారు.

సరుబుజ్జిలి మండలంలో..

సరుబుజ్జిలి: ఈ నెల 26వ తేదీన రొట్టవలస 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు, మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ట్రాన్స్‌కో ఈఈ ఎస్.బయ్యన్నాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొండవలస, రొట్టవలస, పాలవలస, కొండవలస, పెద్దపాలెం, పురుషోత్తపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

ఆమదాలవలస మండలంలో..

ఆమదాలవలస: ఈ నెల 26న పట్టణ పరిధిలోని 33/11కేవీ సొట్టవానిపేట సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ బయ్యన్నాయుడు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పంతులుపేట, సొట్టవాని పేట, ఎఫ్‌సీఐ, కాళింగ మన్నయ్యపేట, తెలగ మన్నయ్యపేట, తురకపేట, చింతాడ, నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. తొగరాం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, జీకే వలస, దూసి ఫీడర్ల పరిధిలోనూ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నారు. నిమ్మతొర్లాడ, జీకేవలస, కొరపం, చేపేనపేట, పాతూరు, కొర్లకోట, చీమలవలస, హనుమంతుపురం, కట్టియాచార్యులపేట, వెదుళ్లవలస, తురకపేట, నెల్లిపర్తి, కలివరం, ముద్దాడపేట, పీర్ సాహెబ్‌పేట, దూసిపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు.

నరసన్నపేట మండలంలో..

నరసన్నపేట: మండలంలోని దేవాది ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు ఈఈ శంకరరావు తెలిపారు. దేవాది, మడపాం, మాకివలస, శ్రీరాంపురం, రావులవలస, లకిమేర, కోమర్తి కూడలిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఆ భూమిని ఎవరూ సాగు చేయవద్దు

- డీఎస్పీ బాలచంద్రారెడ్డి



ఇరువర్గాల వారితో మాట్లాడుతున్న డీఎస్పీ బాలచంద్రా రెడ్డి

జలుమూరు: మర్రివలస పంచాయతీ పరిధి ఎస్టీ మాకివలస భూముల సాగునకు ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు, ఎస్టీ మాకివలస గ్రామస్తులు ఎవరూ సాగు చేసేందుకు వెళ్లవద్దని డీఎస్పీ బాలచంద్రారెడ్డి సూచించారు. జలుమూరు పోలీస్ స్టేషన్‌లో కూర్మ గ్రామానికి చెందిన ఇస్కాన్ ప్రతినిధులు, ఎస్టీ మాకివలసకు చెందిన ఆదివాసీ రైతులతో బుధవారం మాట్లాడారు. దీనిపై పూర్తి స్థాయి హక్కులు ఎవరికి ఉన్నాయో తహసీల్దార్ ద్వారా సమాచారం సేకరిస్తామన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల ఈ భూమి తమదంటే తమదని అని ఇరువర్గాలు గొడవ పడిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ మధుసూదనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓడీఎఫ్-ప్లస్‌పై ఇంటింటా సర్వే చేపట్టాలి

నరసన్నపేట: ఓడీఎఫ్-ప్లస్‌లో భాగంగా గ్రామాల్లో ఇంటింటా సర్వే చేపట్టాలని నరసన్నపేట ఎంపీడీఓ రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా గ్రామాలు ఎలా ఉన్నాయనే దానిపై సర్వే చేయాలన్నారు. మురుగు కాలువలు, వాటి వినియోగం, చెత్త బుట్టలు వినియోగం, మరుగుదొడ్ల వినియోగం ఎలా ఉన్నాయనే దానిపై సర్వే చేయాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల పనితీరుపై సమీక్షించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై చర్చించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతంగా పూర్తిచేయాలి..

ఆమదాలవలస: మండలంలో ఓడీఎఫ్ సర్వే త్వరితగతిన పూర్తిచేయాలని డీఎల్‌పీఓ గోపిబాల సూచించారు. ఎంపీడీఏ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు అధ్యక్షతన బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. సర్వేలో కీలక అంశాలపై చర్చించారు. ఈఓపీఆర్డీ దుంపల గోవిందరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ రుణ లక్ష్యాలు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్

నరసన్నపేట: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రుణాలు విరివిగా ఇవ్వాలని, ప్రతీ బ్యాంకుకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్య కిరణ్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నరసన్నపేట నియోజకవర్గ స్థాయిలోని నాలుగు మండలాల పరిధిలో ఉన్న బ్యాంకు మేనేజర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. కౌలు రైతులతోపాటు భూమి సాగు చేస్తున్న రైతులందరికీ రుణాలు ఇవ్వాలన్నారు. వన్‌బీ లేకపోయినా భూహక్కు పత్రాల ఆధారంగా కొత్త రుణాలు ఇవ్వాలని, పాత రుణాలు రెన్యువల్ చేయాలని సూచించారు. ఎస్‌జీహెచ్ గ్రూప్‌లకు రుణాల లక్ష్యాలను పూర్తిచేయాలని, స్వయం శక్తి మహిళలకు అవసరమైతే వ్యక్తిగత రుణాలు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో భాగంగా ముద్రణ, పీఎంఈజీపీ లక్ష్యాలు కూడా చేరుకోవాలని, మహిళలకు అంతర్గత అప్పులు ఇవ్వాలని సూచించారు. ఏసీ కొండలరావు, నరసన్నపేట యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, డీపీఎం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణ తప్పనిసరి



ఆమదాలవలస: కృష్ణాపురంలో రికార్డులను పరిశీలిస్తున్న వాసుదేవరావు

ఆమదాలవలస: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు చేపడుతున్న ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఓ, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు సూచించారు. పట్టణంలోని కృష్ణాపురం వార్డు సచివాలయంలో నిర్వహించిన ఆధార్ నమోదు శిబిరాన్ని బుధవారం పరిశీలించారు. నమోదు ప్రక్రియ మందకొడిగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి చేసిందని, అందరూ ఆధార్ నవీకరణ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. 0-5 సంవత్సరాల చిన్నారులకు ఆధార్ నమోదు, 5 నుంచి 15 సంవత్సరాల బాలబాలికలకు బయోమెట్రిక్ నవీకరణ, ఆధార్ కార్డు పొంది 10 సంవత్సరాలు దాటినవారు వారి నివాస ధ్రువీకరణ పత్రం నవీకరణ, ఆధార్‌కు సెల్ నంబర్ జోడింపు వంటివి తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల సిబ్బందితో సమన్వయం చేసుకుని ఆధార్ నమోదు ప్రక్రియ విజయవంతం చేయాలన్నారు. ఎంపీడీఓ వాసుదేవరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

బూర్జ: మండలంలోని పాలవలస గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని డిజిటల్ అసిస్టెంట్ మోనిషా అన్నారు. ఆధార్‌లో పుట్టిన తేదీ, అడ్రాస్ మార్పు, నూతన ఆధార్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహునికి నివాళులు



మెళియాపుట్టి: అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పాతపట్నం: అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్ఈ జోగారావు

మెళియాపుట్టి: గ్రంథాలయాల అభ్యున్నతి కోసం అయ్యంకి వెంకట రమణయ్య ఎంతగానో కృషి చేశారని మెళియాపుట్టి గ్రంథాలయ అధికారి అనురాధ అన్నారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి జయంతి సందర్భంగా మెళియాపుట్టి శాఖా గ్రంథాలయంలో అతని చిత్రపటానికి నివాళులర్పించారు.

పాతపట్నంలో..

పాతపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని బుధవారం నిర్వహించారు. అయ్యంకి చిత్రపటానికి హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.వి.జోగారావు, జీఎంఎస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బి.వాసుదేవరావు నివాళులర్పించారు. శాఖా గ్రంథాలయాధికారి కళ్ల రాజు, వార్డు మెంబర్ పి.రాము, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: స్థానిక శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు నివాళులర్పించారు. గ్రంథాలయ సహాయకురాలు జయలక్ష్మి, పాఠకులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: అయ్యంకి చిత్రపటానికి పూలమాలవేస్తున్న గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు

లంపీస్కిన్‌పై అప్రమత్తం



పాతపట్నం: టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: పశువులకు ముద్ద చర్మవ్యాధి (లంపీ స్కిన్) నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. పాతపట్నం గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ముద్ద చర్మవ్యాధి పాడి పశువులకు సోకితే పాల దిగుబడి తగ్గుతుందన్నారు. పాతపట్నం ప్రాంతీయ పశు వైద్య శాల పరిధిలో 17,600 టీకాలు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఆగష్టు 18 తేదీ వరకు టీకాల వేయడం జరుగుతుందన్నారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: పశువులకు సోకే లంపీస్కిన్‌పై పాడి రైతులు అప్రమత్తమంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ ఏడీ ఆర్.ఆనందరావు సూచించారు. మున్సిపాలిటీ పరిధి 5వ వార్డులో గల చొట్టవానిపేట, పంతులపేట, తదితర గ్రామాల్లో లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఆమదాలవలస, ఎచ్చెర్ల మండలాల్లో 23 వేల డోసుల వేయనున్నట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాలిబాటలతో ప్రయోజనం



కాలి బాటలపై అవగాహన కల్పిస్తున్న సూర్యానారాయణ

కొత్తూరు: వరిలో కాలిబాటలు ఏర్పాటు చేయడం వల్ల పలు ప్రయోజనాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనర్ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని బమ్మిడి గ్రామానికి చెందిన బర్రి మోహన్‌రావుకు చెందిన రెండు ఎకరాల భూమిలో బుధవారం కాలి బాటలను ఏర్పాటు చేశారు. కాలి బాటల వల్ల వరి దుబ్బులకు సూర్య రశ్మి తగిలి ఎటువంటి తెగులు, పురుగులు ఆశించవన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



ఎస్ఐ ప్రసాద్

బూర్జ: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని ఎస్ఐ జి.వి.ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. హెల్మెట్ ధారణ, ట్రాఫిక్ నియమాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. హెల్మెట్ ధారణ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు సిద్ధం చేయాలి

మెళియాపుట్టి: సామాజిక తనిఖీలకు రికార్డులు సిద్ధం చేయాలని ఉపాధి సిబ్బందికి ఏపీఓ రవి, ఈసీ ఈదినారాయణ రెడ్డి సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్షించారు. వచ్చే నెల మొదటి వారంలో మండలంలో సామాజిక తనిఖీలు ప్రారంభమవుతాయన్నారు. గ్రామ పంచాయతీల వారీగా రికార్డులను పరిశీలిస్తారన్నారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి పెండింగ్‌లు లేకుండా చూడాలన్నారు. సామాజిక తనిఖీలపై గ్రామాల్లో ఉపాధి వేతనదారులకు అవగాహన కల్పించాలన్నారు.